క్లుప్తంగా

31నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 31వ తేది నుంచి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ యూనివర్సిటీ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ కో ఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తృతీయ సంవత్సరానికి చెందిన 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 31నుంచి జూన్ 5 వరకు, ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్ 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఈ నెల 10 అని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, అనంతరం పరీక్ష ఫీజును టీఎస్, ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా, డెబిట్, క్రెడిట్ కార్డుతో మాత్రమే చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు అధ్యాయన కేంద్రం సెల్: 7382929640 సంప్రదించాలని కోరారు.

సాగర్ సీఐగా బీసన్న

నాగార్జునసాగర్ : సాగర్ సర్కిల్ సీఐగా కె.బీసన్న బదిలీపై రాగా ఇక్కడ పనిచేసిన కె.నాగరాజు పీసీఆర్ నల్లగొండకు వెళ్లారు. విజయపురి టౌన్ ఎస్ఐగా పనిచేసిన బి.రాంబాబు డీసీఆర్‌బీ నల్లగొండకు బదిలీ కాగా సీసీఎస్ నల్లగొండలో ఉన్న వి.సురేష్ విజయపురిటౌన్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : గ్రామాల్లోకి నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ అమరావతి అన్నారు. శనివారం ఆపోల రీచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని తడకమళ్లలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలందరూ బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ డాక్టర్లు మూడావత్ విజయేందర్, మురళీకృష్ణారెడ్డి, రాగమాలికదేవీ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ గోపికృష్ణ, పారామెడికల్ జటంగి సైదులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ముక్క లింగయ్యయాదవ్, దుర్గయ్య, చనగాని వీరయ్య తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం



అవంతీపురం మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా బృందం

మిర్యాలగూడ టౌన్ : అవంతి పురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం బీజేపీ కిసాన్ మోర్చా, బీజేపీ బృందం అవంతీపురం మార్కెట్ యార్డును సందర్శించిన అనంతరం రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒక వైపు వర్షాలు మరో వైపు ధాన్యం చోరీకి గురవుతున్న మార్కెట్ యాజమాన్యం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చలమల సీతారాంరెడ్డి, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పాలకూరి శైలేంద్ర గౌడ్, రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ భాణావత్ రతన్‌సింగ్‌నాయక్, నాయకులు వెంకన్న, గుండా నవీన్‌రెడ్డి, సాయన్న గౌడ్‌లతో నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నిడమనూరు: అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శోబన్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నరనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను అడ్డగించి తనిఖీ చేశామన్నారు. అందులో 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని డ్రైవర్ సురేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలి

దేవరకొండ : ఈనెల 7న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర కృష్ణ కోరారు. శనివారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించే తెలంగాణ భరోసా సభకు జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో బీఎస్పీ శ్రేణులు సభకు తరలిరావాలని కోరారు.

రూ.2 వెయిటింగ్ చార్జ్ ఇస్తేనే..

ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కిస్తామంటున్న యజమానులు

- 25 రోజుల నుంచి ప్రారంభం కాని కొనుగోళ్లు
- అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు
- అధికారులు స్పందించాలని వినతి



పెండ్లిపాకల ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా పోసిన ధాన్యం

కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించిన అధికారులు. ధాన్యం కొనుగోలు చేపట్టడంలో మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై సుమారుగా 25 రోజులు కావస్తున్నా.. తాలు.. తేమ పేరుతో కొనుగోలులో జాప్యం చేస్తూ వచ్చారు.. అకాల వర్షాల నేపథ్యంలో రైతుల్లో నిరాశ.. నిస్తేజం అలుముకుంది.. ఇదిలా ఉంటే లారీ యజమానులు బస్తాకు రూ.2 చొప్పున వెయిటింగ్ చార్జ్ చెల్లిస్తేనే లారీల్లోకి బస్తాలు ఎక్కిస్తామని చెబుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

లారీ యజమానుల కొర్రీలు

మండల పరిధిలోని పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏప్రిల్ మొదటి వారంలో ఏర్పాటు చేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని తీసుకొచ్చారు. అయితే ఇప్పటి వరకు కూడా కొంత మంది రైతులు ధాన్యం తూర్పార బట్టి తాలు లేకుండా తేమ లేకుండా, తేమ శాతం వచ్చినప్పటికీ 25రోజుల నుంచి కూడా ధాన్యాన్ని లారీలోకి ఎక్కించకపోవడం గమనార్హం. ఈ కారణాలేంటని రైతులను ఆరా తీయగా రైతులు చెప్పిన సమాధానం లారీ యజమానులు బస్తాకి రెండు రూపాయల చొప్పున వెయిటింగ్ చార్జ్ ఇస్తేనే వస్తామని చెబుతున్నారు. ఇంతకుముందు తాలు ఉందని మిల్లు యాజమానులు క్వింటాలుకు ఐదు కేజీల చొప్పున కోత విధించారు. ఇప్పుడు లారీ యజమానులు బస్తాకి రెండు రూపాయల చొప్పున వెయిటింగ్ చార్జ్ యజమానులు అడగడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే, ఎటు చూసినా రైతు నష్టపోయే పరిస్థితి ఉంది. ఒక పక్క ప్రకృతి కోసంతో అకాల వర్షాలు రావడం కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవడం మిల్లర్లు ఇబ్బందులు పెట్టడం, లారీ యజమానులు ఇబ్బంది పెట్టడం ఇవన్నీ కూడా రైతు యొక్క వెన్నుపూసను విరిచినట్లుగా రైతులు తమ బాధను పత్రికలకు తెలుపుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సకాలంలో లారీలను పంపించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పత్రికల ద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



కొనుగోలు ప్రక్రియ చేపట్టడం లేదు.. అకాల వర్షాలు వస్తే రైతులు నష్టపోతాం. ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. నేను ధాన్యాన్ని తీసుకొచ్చి పదిహేను రోజులు కావస్తుంది. తాలు, తేమ లేకున్నప్పటికీ లారీ యజమానులు బస్తాకు రూ.2ల చొప్పున వెయిటింగ్ చార్జ్ చెల్లించాలని చెబుతున్నారు. ఒక్కో లారీకి సుమారు 900 నుంచి 1000బస్తాలు వేయాల్సి ఉంటుంది. ఆ లెక్కన రూ.2వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఎటు చూసినా రైతులకే నష్టం జరిగింది.

\- పరమేశ్, పెండ్లిపాకల

25రోజులు దాటింది



ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఏప్రిల్ 10న ధాన్యాన్ని తీసుకొచ్చాను తాలు, తేమ ఉందని కొనుగోలు చేయమని చెప్పారు. వడ్లను ఆరబెట్టి తూర్పారబట్టి నాణ్యమైన ధాన్యం సిద్ధం చేశాను. ఇప్పటికే 25 రోజులు దాటిపోయింది. అయినా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. సెంటర్ నిర్వాహకులను అడిగితే లారీలు అందుబాటులో లేవని, లారీ యజమానులు బస్తాకి రూ.2చొప్పున వెయిటింగ్ చార్జ్ చెల్లించాలని తేగేసి చెబుతున్నట్లు తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని భయంగా ఉంది.

\- పేర్ల చిన్న రాములు, పెండ్లిపాకల

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి



ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మాడుగులపల్లి: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు వెచ్చిస్తోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కన్నెకల్ గ్రామంలో సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం) నిధులు రూ. 10 లక్షలతో చేపట్టనున్న ఫార్మేషన్ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని గ్రామాలు కనీస వసతులకు నోచక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పల్లెల ప్రగతికి భారీగా నిధులు వెచ్చించడంతో సర్వతోముఖాభివృద్ధి సాధించాయని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లె ప్రగతి కార్యక్రమంలో పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు నిర్మించడంతో గ్రామాల రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్ యాదవ్, మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, సర్పంచ్ సరితవెంకన్న, ఎంపీటీసీ రజితనరేందర్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, నాయకులు పోకల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్, కృపాకర్, రామాంజిరెడ్డి, శ్రీను, సైదులు, జాన్‌కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారంలోనే బిల్లుల చెల్లింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

గుర్రంపోడు : 'మన ఊరు మన బడి' పనులు చేపట్టి ఎంబీ రికార్డు చేసిన వారంలోనే బిల్లులు చెల్లించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నందున ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని మండల విద్యాధికారి తరి రాము కోరారు. శనివారం మండలకేంద్రంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో హెచ్ఎంలకు, సర్పంచ్‌లు, ఎస్ఎంసీ చైర్మన్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ చేసిన పనులకు సంబంధించి కంట్రాక్టర్లకు పైసా బిల్లు పెండింగ్‌లో లేదన్నారు. ప్రతివారం పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారని, పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. పనులకు సంబంధించి నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు పూర్తి చేసిన వెంటనే ఎంబీ రికార్డు చేసి వెంటనే బిల్లులు మంజూరు చేస్తామని డీఈఈ శైలజ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, ఏఈ రవికుమార్, నోడల్ అధికారి సిహెచ్ వెంకట్రామ్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం హిమజ, సర్పంచ్‌లు చాడ చక్రవర్తి, గట్టుపల్లి మణిపాల్‌రెడ్డి, సైదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం మండలంలోని వర్ధమానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఫకీర్‌పురం, పీలియాతండా, సింగియతండా, వర్ధమానిగూడెంలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మన ప్రభుత్వం మన పథకాలు కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. రూ.42లక్షల పనులు సీసీ రోడ్డు, పకీర్‌పురంలోని ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కోసం రూ.2లక్షలతో చేపడుతున్న పనులను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదేళ్ల కాలంలో దేవరకొండ నియోజకవర్గంలో రైతులకు రైతు బంధు ద్వారా సంవత్సరానికి నియోజకవర్గం మొత్తం రూ.300 కోట్లు అని, అలాగే మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గానికి రూ.600 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు శంకర్‌నాయక్, కుంభం శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ కస్తూ రి జానకమ్మ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దస్రూనాయక్, నాయకులు రాంబాబునాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, వెంకట నర్సు, మంతునాయక్, సురేష్‌నాయక్, ఎంపీటీసీ సేనావత్ రజిత, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై విచారణ చేపట్టాలి



స్థానికులతో కలిసి బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : అక్రమ కట్టడాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. శనివారం పట్టణంలోని 38, 36 వార్డు ఎరుకల బజారులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎరుకుల బజారు నాలాపై 2012లో మున్సిపల్ నిధులతో వంతెన ప్రారంభించి 80శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆ వంతెనపై ప్రస్తుతం బ్రిడ్జి నిర్మించడానికి రూ.25లక్షలు మంజూరు చేశారని, రూ.2.5లక్షలతో నిర్మితమయ్యే పనులకు నిధులను పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. గతంలో చేసిన పనులకు సైతం ఎస్టిమేట్ వేసి వంతెన నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచి ప్రజాధనాన్ని కాంట్రాక్టుల పేరుతో దోచుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. 38వ వార్డు కాంగ్రెస్ నాయకులు వంతెన నిర్మాణ వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ స్పందించకపోగా తక్షణమే 8 రోజుల్లో వంతెన పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను మున్సిపల్ కమీషనర్ ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం వ్యవహారంపై తక్షణమే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వంతెన నిర్మాణ వ్యయం తగ్గించి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలు, నాగునాయక్, సీనియర్ నాయకులు శౌరి, ఇంద్రకుమార్, కౌన్సిలర్లు జానిపాషా, శ్రీను, రవినాయక్, మౌయిజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, వెంకటేష్‌గౌడ్, నాయకులు సిద్ధునాయక్ పాల్గొన్నారు.

సమయాన్ని ప్రార్థనలో గడపాలి

మిర్యాలగూడ : హజ్ యాత్రికులు తమ సమయాన్ని ప్రార్థనలోనే గడపాలని ముఫ్తీ మజ్హరుద్దీన్‌ఖాస్మీ అన్నారు. శనివారం పట్టణంలోని మస్జిద్ అరాఫత్‌లో స్థానిక హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విలువైన సమయాన్ని నమాజులలో, అల్లాహ్ స్మరణలో నిబద్ధతతో గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా మగ్దూం, మౌలానా మహమ్మద్‌వలీయుల్లా, ముఫ్తీ మహమ్మద్ ఇమ్రాన్, సొసైటీ కార్యదర్శి అర్షద్‌ఖాన్, ఖాజా హమీదొద్దీన్, ఎండి.అస్లాం, అయూబ్‌ఖాన్, ఎండి.రఫీలు పాల్గొన్నారు.



యాత్రికులకు శిక్షణ ఇస్తున్న ముఫ్తీ మజ్హరుద్దీన్‌ఖాస్మీ

ఘనంగా బంగారు మైసమ్మ తల్లి జాతర



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



అమ్మవారిని దర్శించుకుంటున్న జానారెడ్డి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవ మైన బంగారు మైసమ్మ తల్లి జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాను ఊరేగింపులో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా రైతుబంధు సమితి సభ్యులు కుందూరు వీరకోటిరెడ్డి, హాతీరాం నాయక్, రవితేజ, నాయకులు ఎండీ.యూసుఫ్, పెదకోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, లక్ష్మీసత్యనారాయణ, నాగుల్‌మీరా, నర్సయ్య, వీరబాబు, సోమయ్య, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, శ్రీనివాస్, రఫీ పాల్గొన్నారు. అలాగే మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలి

హాలియా : దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడ్డ అధికార పార్టీ ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేసి వారి నుంచి సొమ్మును రికవరీ చేసి బాధితులకు ఇవ్వాలని మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధులో అవినీతికి ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల నాయకులు శనివారం హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హాలియా మండల అధ్యక్షుడు గార్లపాటి ప్రసాద్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాదిగ, నాయకులు సైదీష్ మాదిగ, యాదయ్య, చిన్న, వెంకటయ్య, చరణ్, ఈరయ్య, కోటేష్, నాగరాజు, శేఖర్, శ్రీను, కోటరాజు, అనిల్, విజయ్ ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జూలకంటి

మాడుగులపల్లి : తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మాడుగులపల్లి మండలంలోని పాములపాడు ఐకేపీ కేంద్రంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన.. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించి పరిశీలించి మాట్లాడారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేశం, వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు పాల్వాయి రాంరెడ్డి, నాగమ్మ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాలి పురుషోత్తంరెడ్డికి నివాళి

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామంలో మాలి పురుషోత్తంరెడ్డి ద్వితీయ వర్ధంతి ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, వెంకటేశ్వర్లు, గోవర్ధని ఉన్నా రు.

బాల్య వివాహాలను అరికట్టాలి

హాలియా : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంగవానికుంటతండా సర్పంచ్ సాలీ, సూపర్‌వైజర్ రమాదేవీ తెలిపారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం అనుముల మండలంలో పంగవానికుంటతండాలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఆడ పిల్లలకు వివాహం చేయరాదని చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైన బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, జ్యోతి, ఏఎన్ఎం పార్వతీ, ఆశలు సోనిచ సైదమ్మ, రాజకుమారి, నాగమ్మ, సరిత, వెంకటమ్మ, ధనమ్మ, దేవీ, పోలీస్ అధికారి హాతిరాం, తల్లులు, పిల్లలు ఉన్నారు.

నిరుద్యోగ సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రఘువీర్‌రెడ్డి, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ : ఈనెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించే నిరుద్యోగుల సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పరిశీలకులు కుందూరు రఘువీర్‌రెడ్డి లు అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వంపై పోరాడేందుకు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టే నిరుద్యోగ సంఘర్షణ ర్యాలీకి ప్రియాంకగాంధీ హాజరై నిరుద్యోగుల డిక్లరేషన్‌ను ప్రకటిస్తారన్నారు. ఈ ర్యాలీకి నిరుద్యోగులు భారీగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల నల్లగొండలో నిర్వహించిన నిరుద్యోగుల నిరసన దీక్షకు యువత అధిక సంఖ్యలో హాజరయ్యారని అదే స్ఫూర్తితో హైదరాబాద్‌లో నిర్వహించే నిరుద్యోగ సంఘర్షన ర్యాలీకి సైతం హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాంతారెడ్డి, బసవయ్య, ఎంఏ.సలీం, మెరుగు శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, నాయకులు ఎండి.గౌస్, ఇమ్రాన్, బాల, షాహిద్ పాల్గొన్నారు.

తాలు పేరుతో ధాన్యం తిరస్కరణ

- 18మంది రైతుల కాంటాల నిలిపివేత
- ఇబ్బంది పెడుతున్న నిర్వాహకులు
- నిన్నటి వరకు లేని నిబంధనలు ఇప్పుడెలా వచ్చాయంటున్న రైతులు



ఊట్కూర్ ఐకేపీ సెంటర్‌లో టేబుల్ ఫ్యాన్ ద్వారా తాలు తీస్తున్న నిర్వాహకులు


నిడమనూరు : మండలంలోని ఊట్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరుతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు పాటించని నిబంధనలు శనివారం మధ్యాహ్నం నుంచి కక్ష కట్టి వేధిస్తున్నారని రైతులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం గతనెల ఫిబ్రవరి 3న ప్రారంభించగా ధాన్యం కొనుగోలు మాత్రం అదే నెలా 12న మొదలైంది. శుక్రవారం వరకు ఊట్కూర్ కేంద్రంలో 12వేల క్వింటాళ్ల ధాన్యం కాంటాలు వేశారు. తాలు అధికంగా ఉందని శనివారం 18మంది రైతుల ధాన్యాన్ని తిరస్కరించారు. కాంటాలు సక్రమంగా కావడం లేదని రైతులు రాస్తారోకో నిర్వహించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వచ్చి విచారించిన సందర్భంగా నిర్వాహకులపై రైతులు ఆరోపణలు చేశారు. దీంతో వారిని ఆయన హెచ్చరించాడంతో శనివారం నుంచి నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. ధాన్యం రాశుల నుంచి శాంపిల్ తెచ్చి టేబుల్ ఫ్యాన్ ద్వారా పట్టి వచ్చిన తాలును తూచి మరీ కాంటాలకు అనుమతి ఇస్తున్నారు. శనివారం మధ్యాహ్న నుంచి ఈ తరహా విధానాన్ని పాటిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం లేని నిబంధనలు మధ్యాహ్నం ఎలా వచ్చాయని రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. శనివారం 20 మంది రైతులకు సంబంధించిన ధాన్యం పరిశీలించగా ఇద్దరివి మాత్రమే నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని, మిగతా 18 మంది తాలు అధికంగా ఉందని వాటని కాంటా వేయమని చెప్పారు. దీంతో రైతులు జిల్లా అధికారులకు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. ఊట్కూర్ కేంద్రంలో పలు అవకతవకలు జరుగుతున్నాయని, ఇష్టం వచ్చిన విధంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సోమవారం కేంద్రానికి వస్తానని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు చెప్పినట్లు రైతులు పేర్కొన్నారు.

నిబంధనల మేరకే కొనుగోళ్లు

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నాం. ఊట్కూర్ కేంద్రంలో శుక్రవారం వరకు 1 వేల క్వింటాళ్ల ధాన్య ంకొనుగోలు చేశాం. శనివారం ఫిర్యాదులు తన దృష్టికి రాలేదు, వస్తే పరిశీలిస్తా.

\- నర్సింహ్మా, ఏపీఎం, నిడమనూరు

ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారు



ఊట్కూర్ కేంద్రంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల రోజులగా పాటించని నిబంధనలు శనివారం మధ్యాహ్నం నుంచి అమలు చేస్తున్నారు. ఫిర్యాదు చేశామనే కారణంతోనే కక్ష కట్టి నిబంధనలు పేరుతో కాంటా వేయకుండా అడ్డుపడ్డారు. కేంద్రంలో జరుగుతున్న వ్యవహారాలపై జిల్లా అదనపు కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశాం

\- బత్తిని మనోహర్, రైతు, ఊట్కూర్

అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా కేసీఆర్ పాలన



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు, నాయకులు

మాడుగులపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అందుకే దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్-3 వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో సెక్రటేరియట్‌కు ఆయన పేరుపెట్టి, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, సర్పంచ్ మారుతి వెంకట్‌రెడ్డి, పోకల రాజు, బీజేపీ మండలాధ్యక్షుడు నరసింహ, పెరుమాళ్ల శ్రీను, కొమ్ము అశోక్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



ఆలయంలో దుండగులు తెరిచిన హుండీ

త్రిపురారం : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీ పరిధిలో బెజ్జికల్ రోడ్డులో వెలసిన్న ఉమ్మలయ్య ఆలయంలోని హుండీని దుండగులు పగులగొట్టి అందులోని కానుకలను అపహరించారు. శనివారం ఆలయ చైర్మన్ నగిరి శ్రీనివాస్ గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.